**వీరేసు శవాన్ని కాల్చడానికి క్రైస్తవులు ఒప్పుకోరు. పాతిపెట్టడానికి హిందువులు ఒప్పుకోరు. కోడికేసు ఎలా తెల్లవారింది?**

రాయుడు నగరం అన్ని హంగులూగల పల్లెటూరు. పంచాయితీ బోర్డు ఆఫీసు, ఊరు మధ్యన రామాలయం, ఊరుకు తూర్పున మంచినీటి చెరువు, హరిజనవాడలో ఓచిన్న చర్చి, ప్రాథమిక పాఠశాల— అన్నీ వున్నాయి ఆ వూళ్ళో.

ఆసుపత్రి లేకపోయినా తెలుగు మందులు యిచ్చే ఆచార్లుగారు, ఇంజక్షన్లు యిచ్చే కాంపౌండరు నారాయణ వున్నారు. కాకపోతే ఆ వూరుకు వున్న యిబ్బంది ఒక్కటే.

రైలు యెక్కి పటణం వెళ్ళాలన్నా, బస్సుయెక్కి ఏ వూరైనా వెళ్ళాలన్నా మూడుమైళ్ళు మట్టిరోడ్డున పడి నడవాలి. వేసవి కాలంలో అయితే జీపులూ, జట్కాలూ ఆ రోడ్డున నడుస్తాయి కాని, వర్షాకాలంలో ఎడ్లబళ్ళు కూడా నడవడం కష్టం. బంక మట్టిరోడ్డు కావడంతో మోకాళ్ళదాకా దిగబడిపోతాం వర్షాకాలంలో. అందుకే ఆ వూరికి ఆఫీసర్ల రద్దీ తక్కువ. రోజూ పక్క వూరునుంచి పోష్టుమేన్ వస్తాడు దసరా మామూళ్ళకి, సంక్రాంతి మామూళ్ళకీ పోలీసు కానిస్టేబులు వస్తాడు. ఆ వూరుకి ఎనిమిది మైళ్ళ దూరంలో పోలీసు స్టేషను వుంది.

అది మండు వేసవికాలం. మట్టిరోడ్డు బాగా ఆరి వుంది. సైకిళ్ళు, జట్కాలూ, చెరుకు లారీలు నడుస్తున్నాయి.

ఓరోజు మధ్యాహ్నం ప్రెసిడెంటు గోపాలాన్ని ఒకసారి యింటికి రమ్మని సుబ్బన్న కబురుచేశాడు.

సుబ్బన్న సాదా మనిషికాదు. గోపాలానికి ముందు రాయుడు నగరానికి సుబ్బన్నే ప్రెసిడెంటు చాలాకాలం. ఊరుకి పెద్ద కామందు. వందెకరాల వ్యవసాయం. రెండు మండువాల లోగిలి

గోపాలం ప్రెసిడెంటు కావడానికి కారణం సుబ్బన్నే. తనమీద ఎవరో పోటీ పెడదామనుకుంటున్నారని తెలిసి, తాను తగ్గిపోయి చదువుకున్న కుర్రాడు, కరణంగారి అబ్బాయి గోపాలాన్ని పెడదాం యీసారికి ప్రెసిడెంటుగా అని పదిమందిలోనూ అన్నాడు. దాంతో పోటీ చేదామనుకున్న వాళ్ళు కూడా తగ్గిపోయారు. దానికి కారణం సుబ్బన్న. కరణం కలిస్తే ఆ వూళ్లో ఎదురు నిలబడే మొనగాడెవడూ లేడని అందరికీ తెలియడమే. ఆ విధంగా గోపాలం ప్రెసిడెంటయ్యాడు ఆ వూరికి.

అందుకే సుబ్బన్న కబురు పంపగానే గోపాలం రెక్కలు కట్టుకొని వాలాడు సుబ్బన్న ముందు.

సుబ్బన్న నవాబీ బల్లమీద కూర్చుని చుట్ట చుట్టుకుంటూ, వచ్చిన గోపాలాన్ని తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. చుట్టిన చుట్ట మొన కొరికి నోట్లో పెట్టుకుని ముటించాడు సుబ్బన్న. సుబ్బన్న తనని ఎందుకు కబురుచేశాడా అని. అతని మాట కోసం ఎదురు చూస్తున్నాడు గోపాలం.

"ఈ యేల టౌను కెల్తున్నావా?" అన్నాడు సుబ్బన్న.

"సాయంత్రం వెడదామనుకుంటు న్నాను" అన్నాడు గోపాలం.

"ఓసారి మన ఎస్ ఐ ని రామాను. ఈరాత్రికే రమ్మను భోజనం మనింటికాడే నని చెప్పు" అన్నాడు సుబ్బన్న.

"దేనికి?"

"దేనికో నువ్వే చూద్దువుగాని ఎస్ ఐ ని యెంటబెటుకొని వచ్చెయ్" అని ఆదేశించాడు సుబ్బన్న గోపాలాన్ని.


"నా దగర కూడా రహస్యమేనా?" అన్నాడు గోపాలం నవ్వుతూ.

"నీకాడ నాకురహస్యమేంవుందయ్యా. మన పొలంలో రోజూ ఓ కోడి మాయమై పోతావుంది. గెద్దలు మాయంచేత్నన్నాయా అంటే పైన వలేశాను. నక్కలు మాయం చేత్తన్నాయా అంటే మన ఈరేసుగాడూ, మా అబ్బాయి రంగడూ పొలంలోనే తొంగుంటున్నారు. ఓపాలి ఎస్ ఐ ని పిలిపించి యిసయం చెబితే అతగాడే కనుక్కుంటాడని' అన్నాడు సుబ్బన్న కాస్త వివరంగా.

ఇంక ఎదురు ప్రశ్నలు వేయకుండా గోపాలం సరేనని చెప్పి వెళ్ళిపోయాడు.


చీకటిపడ్డాక గోపాలం, ఎస్. ఐ., హెడ్ కానిస్టేబులు రాజు సుబ్బన్న ఇంటి ముందు సైకిళ్ళు దిగారు.

"రండి రండి" అంటూ సుబ్బన్న ఎస్. ఐ ని, హెడ్ కానిస్టేబుల్ రాజుని లోపలికి ఆహ్వానించాడు.



# కోడికేసు

సి. యస్. రావు




చేయాల్సిన మర్యాదలు చేశారు. భోజ నాలు వడ్డించారు. సుబ్బన్న, గోపాలం, ఎస్.ఐ హెడ్డు భోజనాలు చేస్తున్నారు.

"కోడి కూర మా బాగుందండీ." అన్నాడు ఎస్.ఐ.

"ఆ కోడి తగువుకోసమే తమర్ని కబు రంపింది" అన్నాడు సుబ్బన్న.

"మీరు తీర్చలేని తగువు ఏముందండి బాబూ" అన్నాడు హెడ్.

"నిజమే అనుకో కాని కొన్ని తగు వులు మీరు తీర్తేనే గొడవుండదు. మీ కాకీ బట్టలంటే వున్న భయం మేవంటే వుండదు" అన్నాడు సుబ్బన్న.

ఎస్. ఐ. నవ్వుకున్నాడు.

"అదొకటే కాదు ఎస్. ఐ గారూ! తలా తోకా లేని లంజ కొడుకుని ఓ దెబ్బేసేమ అనుకోండి. రోజులు యిదివరకటిలా లేవు పట్టుకున్న ఆడు ఏతప్పుకి నిప్పెరతాడు. నష్టపోయేది మనమేగా. మీరే ఓ దెబ్బేశా రనుకోండి. మి డ్యూటీ మీరు చేసినట్టె వుద్ది. ఆడు నోరెత్తలేడు. అందుకని మీ చేతిమీదే జరిపితే బాగుంటదీ, గొడ వుండదని మిమ్మల్ని కబురంపాను." అన్నాడు సుబ్బన్న.

"దాందేవుంది. కబురంపండి ఆడ్ని—తేల్చేద్దాం" అన్నాడు హెడ్ కానిస్టేబుల్ రాజు.

ఇంతకీ ఆ వ్యక్తి ఎవరో గోపాలానికి అంతు చిక్కడంలేదు.

భోజనాలు అయ్యాయి. చేతులు తుడుచు కొని పెరటివైపు ధాన్యం కొట్లదగ్గర నలు గురూ పడక కుర్చీల్లో నడుములు వాల్చారు. హెడ్ కానిస్టేబుల్ రాజు మాత్రం కుర్చీలో కూర్చున్నాడు. నడుం వాల్చలేదు.

ఇంతలో రాత్రి పూట పాలు పట్టుకొని

అత్యంత ప్రమాణవు పుస్తకాలు
అనేక లక్షల మంది ఎంచుకునేవి

| | రూ. |
|---|---|
| గల్ఫ్ పర్వీస సమాచార గైడు | 35/- |
| రేడియో అండ్ ట్రాన్సిస్టర్ గైడు | 15/- |
| టివి పర్వీసింగ్ మేడ్ ఈజీ | 20/- |
| 300 కుటీర పరిశ్రమల గైడు | 30/- |
| సెక్స్ అట్లాస్ (యు.ఎస్.ఎ ప్రచురణ) | 15/- |
| పడక గదిలో 63 రంగుల ఫోటోలు | 15/- |
| పురుషుడు స్త్రీని వశపరచుకునే విధానం | 15/- |
| కామ సూత్రాలు (వాత్స్యాయన) | 15/- |
| కోక శాస్త్రం (112 బొమ్మలతో) | 15/- |
| 144 రహస్య కెమెరా ఫోటో అల్బమ్ | 30/- |

మీ ఆర్డరుతో బాటు. దయచేసి. పోస్టేజి మరియు పేకింగ్ లకుగాను రు.4/- అడ్వాన్సు పంప గోరెదము

RAJKAMAL PRAKASHAN
(1B) ALIGARH 35

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనా నాపరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వివాశక్" వాడిన యెడల మూడు దివసములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address :
Samaj Kalyan (R.L. 78)
(P. o) Katri Sarai (Gaya)

"జ్యోతి చిత్ర"
చదివి ఆనందించండి!

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవపుర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యంచేయబడును. వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.

డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
SUVARNA

బ్రాంచి : 5/1, బ్రాడీపేట, గుంటూరు-2

వీరేసువచ్చాడు. వాడికి పోలీసులంటే చాలా కాలం నుంచి భయం దాంతో ఎస్ ఐ.ని. హెడ్ ని చూపి కాస్త కంగారుపడ్డాడు.

వాడు పోలీసుల్నిచూపి భయపడ్డాని క్కారణం లేకపోలేదు. ముప్పై ఏళ్ళక్రితం వాడి యిరవయ్యో యేట మిలిటరీనుంచి పారిపోయి వచ్చేశాడు. సుబ్బన్న నీడని చేరాడు. అప్పట్లో వాడిపేరు వీరాస్వామి. పోలీసులు యెంక్వయిరీకి వచ్చినప్పుడు వీరాస్వామి ఆ వూరువచ్చాడు కాని, చచ్చిపోయాడని చెప్పాడు సుబ్బన్న పోలీసులకి. అలా చెప్పినట్టు వీరాస్వామికి తెలీదు. వీరాస్వామి పేరుమార్చి "వీరేసు" అని పెట్టిందికూడా సుబ్బన్నే. అందుకే వాడికి పోలీసులంటే భయం. అలా సుబ్బన్న చేసిన వుపకారం వీరేసుకి తెలియక పోయినా, ఆదుకున్నాడన్న విశ్వాసంతో కుక్కలాగే కాపు కాస్తున్నాడు వీరేసు సుబ్బన్న కమతాన్ని- ఆ నాటి నుంచీ. వాడికి నా అన్నవాళ్ళెవరూ లేరు. పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి చేసుకుంటే- తీరా పోలీసులొచ్చి తనని లాక్కుపోతే పెళ్ళాం దిక్కులేనిదై పోతుందన్న భయంతో పెళ్ళి ప్రసక్తి ఎత్తుకోలేదు వీరేసు. బతుకు మీద తీపికొద్దీ. అన్ని కోరికల్నీ చంపుకుని సుబ్బన్న కమతంలోనే బతికేస్తున్నాడు నిశ్చింతగా.

"అమ్మగోరూ! పాలు లోనెట్టండి."
అని పాల చెంబులు వరండాలో వుంచాడు వీరేసు. వచ్చిన పని అయిపోయిందన్నట్టు "మరి నే నెల్లొత్తానండి" అని సుబ్బన్నకు చెప్పి బయలుదేరబోయాడు.

"ఆగరా! ఏడుదువుగానిలే" అన్న సుబ్బన్న మాటమీద చేతికర్ర పరచుకొని దానిమీద కూర్చున్నాడు వీరేసు.

"ఇరవై నాలుగ్గంటలూ పొలాన్ని అంటిపెట్టుకొని వుండేది యీడూ. నా కొడుకేనండి మరి. నేను సందాలమాటు వూరికే ఓపాలి అలా ఎల్లొత్తానంతే" అన్నాడు సుబ్బన్నఎస్ ఐ తో.

ఎస్. ఐ. విషయం గ్రహించేశాడు.

సుబ్బన్న వీరేసునే అనుమానిస్తున్నాడనుకున్నాడు.

"నీ పేరేమిట్రా?" అన్నాడు ఎస్. ఐ.

"ఈరేసండి" వీరేసు జవాబు.

"పొలంలో కోళ్ళు పోతున్నాయట. ఎవరెత్తుకుపోతున్నారంటావ్?"

"రోజూ ఒక పెట్టో, పుంజో పోతం మాట నిజమేగాని ఎవరెత్తుకుపోతన్నరో నాకు తెల్దండి బాబు."

"నీకు తెలియకపోతే మరింకెవరికి తెలుస్తుందిరా!" వీరేసు మాట్లాడలేదు.

# కురుస్తున్న కొత్తదనం

కొత్తదనాన్ని కురుస్తున్నాను
కుండపోతగా
జీసస్ రక్తాన్ని చేదుకుని:
మహాత్ముని ఆఖరి మూలుగుల్ని
మబ్బులుగా అల్లుకుని.
లేకుంటే లేదు
ఈ జాతికి పురుడు.
కాకుంటే పోదు
గొడ్డువోయిన నిరుడు.

శ్వాసల కొరడాలతో బాదితే తప్ప
పనేమీ కదలదీ గుర్రం.
కాలమట దీనిపేరు - ప్చ్!
అలంకరించుకున్న సజీవ శవం.
ఇది నేర్చుకున్న పాఠం
ఎడారిలో ఇసక పలకమీద
అనావృష్టి అ ఆ లు.
అప్పుడే బలిసిపోయిందిది
ఎంఫిల్ లను మేసినట్టు
పి. హెచ్ డీ లను ఊదేసినట్టు.

ఇంతకూ వర్షందేనికి?
మట్టికి కూడా మనసుందనీ;
చినుకు పలకరించినా అది
చెమ్మగిల్లుతుందని చెప్పడానికి.
ఎంతో గొప్పది మబ్బు - కానీ
ఎందుకా గ్రంథచౌర్యం?
దొంగిలించిన నీటి ఆవిరిని
సొంత కథలా సంగ్రహించుకుని
మళ్ళీ కురుస్తూ వుంటుందే
మా తెలుగు వెండితెర మీద.

మామూలుగా నేను నడుస్తూ
వుంటాను
మంచుగడ్డల మీద
మంటల అడుగులతో.
కానీ ఇప్పుడు కురుస్తున్నాను
రేపటిని అలలెత్తించే
నేటి పిడుగులతో.

— డాక్టర్ సి. నారాయణరెడ్డి

"సుబ్బన్నగారబ్బాయీ. నువ్వే కదా పొలంలో వుండేది! వారబ్బాయికి కోడిని దొంగతనం చేయాల్సిన కర్మేం పట్టింది" అన్నాడు ఎస్. ఐ.

"అందుకని నేనే చేత్తన్నానంటారా కోళ్ళని" అన్నాడు వీరేసు మనసు నొచ్చుకున్న ధోరణిలో.

సుబ్బన్న వీరేసు గురించి ఆలోచించాడు. తాను వయసులో వుండగా వీరేసు తనదగ్గర కొచ్చాడు. ఆ రోజుల్లో తన రహస్యాలన్నీ వాడికి తెలుసు పక్కవూళ్లో కొండమ్మ అనే మనిషిని తాను వుంచుకోవడం వాడికి తెలుసు. దానికి పండూ ఫలం పట్టుకెళ్ళి యిచ్చి వచ్చేవాడు. తన మాట మీద అర్ధరాత్రి వేళ ఓ పెద్ద మనిషి కుప్పకి నిప్పెట్టి రమ్మంటే వచ్చాడు. ఆ విషయాలు యింత వరకు రెండవకంటి వాడికి తెలియనివ్వలేదు వీరేసు. మనసులోనే దాచుకున్నాడు అంత గుట్టయిన మనిషి ఈ విషయం అంత తేలిగ్గా బయటపెడతాడా?" అనుకొన్నాడు సుబ్బన్న."

"ఆడు మా చెడ్డ గుటయిన మనిషండి. అంత తేలిగ్గా బయట పెట్టడండి ఏ యినయవయినాను." అన్నాడు సుబ్బన్న.

"ముప్పైఏయేళ్ళబట్టి ఆరి పాదాల దగ్గరే బతుకుతున్నాను. ఆరి గుట్టూమట్టూ నాకు తెలుసు. ఎప్పుడూ బయట పెట్టలేదు ఇన్నాళ్ళకి యదవ కోడికోసం నన్ను అనుమానిత్తన్నాడా సుబ్బన్నగోరు. కావాలంటే అడిగి తీసుకునే ధైర్యం నాకు లేదా? నాకు తెలిసిన నిజం చెబితే యింత మందిలోనూ యాయనగోరి పరువు ఏమైపోద్ది? నేను చచ్చినా చెప్పను" అనుకున్నాడు వీరన్న.

"యేరా నిజం చెబుతావా? చెప్పించమంటావా?" అన్నాడు హెడ్ రాజు.

"నాకు తెల్దండి" ముక్తసరిగా సమాధానం యిచ్చాడు వీరన్న.

"ఆడంత తేలిగ్గా చెప్పడని చెప్పాకదండి. గుట్టయిన మనిషి" అన్నాడు సుబ్బన్న.

ఆ మాటలో నువ్వు లేచి రెండు తగలనిస్తేగాని చెప్పడన్న భావం వుంది.

హెడ్ కానిస్టేబిల్ రాజు ఎస్ ఐ. ముఖంలోకి చూశాడు.

ఎస్. ఐ. "సై" అన్నాడు.

రాజు వీరిగాడి దగ్గరకు వెళ్ళి, వాడి వెనక నిలబడి జుట్టు పట్టుకొన్నాడు. వీరిగాడు కూర్చుని వున్నాడు.

"కొడితే కొట్టండి. నాకు మాత్రం ఏమీ తెల్దు" అన్నాడు వీరిగాడు మొండిగా.


# తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు మండి ప్రశంసలు అందినవి. ఇది అంత ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారిపోవడం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు మన్నా ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అవి ఎంత బాగా మానిపోతుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెడు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందుని ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. తెల్ల మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.

ఈ వైద్యంకోసం మందును ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)

THE INSTITUTE OF ENGLISH STUDIES

ఆంగ్ల భాషాబోధక సంస్థ

17, మొదటి మెయిన్‌రోడ్డు, లేక్ ఏరియా, నుంగంబాకం, మదరాసు-600 034

(వళ్లువరుకోటము ప్రక్కన)

Let us together take delight in the TWILIGHT, the Nature's spectacular impression and expression of the varied aspects of EDUCATION.

16 ఏండ్ల వయస్సునకు పైబడినవారు

అధికపక్షము ఒకే సంవత్సరములో

విశ్రాంతి సమయములో

అంగ్లములో

సంభాషించుటకును, పరిచయము చేసుకొనుటకును

తపాలా ద్వారా

ఇంగ్లీషు

నేర్చుకోవచ్చును.



...ంచి విందును బంధుమిత్రులు చుట్టుముట్ట మిత్రత్వముతో అందరుకలిసి ఆరగించవలెనని భగవంతుడు ప్రవక్తయైన మహమ్మదు మూలముగా లోకమునకు బోధించెనో? విద్య ప్రసాదించు వివేకమనెడి విందును ఒక్కుమ్మడిగా కలిసి రుచిచూచెదము. అందరు రారండు!

చేరుటకై దరఖాస్తు చేయుటకు ఆఖరు తేదీకిని, పూర్తి వివరములకును వెంటనే లేఖను వ్రాయండి.

25 పైసల తపాలాబిళ్లతో పూర్తి వివరములను తెలుసుకొనండి. వెంటనే చేరండి.

G. SHANMUGASUNDARAM, Principal

రాజు వీరిగాడి జుట్టు అలాగే వెనక నుంచి పట్టుకుని మోకాలుతో వాడి వెన్నులో ఒక్క పోటు పొడిచాడు. వీరిగాడికి ఏడుపు వచ్చింది.

అలా పోటుమీద పోటు పొడుస్తూ "నీచేత ఎలా చెప్పించాలో మాకు తెలుసురా" అంటున్నాడు హెడ్.

అలా నాలుగైదు పోటులు పొడిచాక వీరిగాడు ఉలుకూ, పలుకూ లేకుండా వుండిపోయాడు.

ఆ పోటు ఎంత ప్రమాదకరమైందో తెలిసిన ఎస్. ఐ "ఇక చాల్లె" అన్నాడు రాజుని.

*　　*　　*

తెల్లవారింది.

సుబ్బన్న మకాం దగ్గర పడివున్న వీరేసు శవాన్ని వాళ్ళ పేటలో జనం మోసుకొనిపోయారు.

పేట రెండు ముక్కలై పోయింది. అట్టుడికిపోతోంది.

వీరేసుని పోలీసులు కొట్టినందుకుకాదు. అసలు సంగతి వాళ్ళెవరికీ తెలీదు.

సుబ్బన్న వీరేసుకి దొంగతనం కట్టినందుకు కాదు.




వీరేసు చనిపోయినందుకు కాదు.

వీరేశుని దహనం చెయ్యాలనికొందరు. కాదు పాతిపెట్టాలని కొందరూ పట్టుపట్టుకొని కూర్చున్నారు. కొట్లాటకు కూడా సిద్ధపడుతున్నారు.

దానికి కారణం వీరేసు అసలు పేరు వీరాస్వామి. అప్పట్లో వాడు హిందువు. అందుకని కొందరు దహనం చేయాలని. కాదు ప్రస్తుతం వాడు వీరేసు. మతం పుచ్చుకున్నాక పెట్టిన పేరు అది. వీరేసు పేరుతోటే చనిపోయాడు కాబట్టి పెట్టెలో పెట్టి పాతి పెట్టాలని క్రైస్తవులు. అదీ తగాదా!

పొద్దుటి నుంచి సాయంత్రందాకా వీరేసు శవాన్ని అలా వుంచేశారు. తగువు తేలలేదు.

ఈ లోగా ఈ వార్త ఎస్. ఐ.కి తెలిసింది. రాత్రికి రాత్రి మఫ్టీలో వచ్చే సి ప్రెసిడెంటు గోపాలం ముందు వాలిపోయాడు.

"ఏమిటి యింత కంగారుగా వచ్చారు" అన్నాడు గోపాలం.

"వీరేసుగాడు చచ్చాడటగా. వాడిని ఎలాగైనా తగలబెట్టించాలి సార్. లేకపోతే ఎవరేనా పిటీషను పెడితే పాతిపెట్టిన శవాన్ని బయటకితీసి శవపరీక్ష జరిపితే దెబ్బలు బయటపడతాయి. నా ఉద్యోగం పోతుంది. నా పెళ్ళాం, బిడ్డలు దిక్కులేనివాళ్ళయిపోతారు." అంటూ గోపాలం చేతులు పట్టుకున్నాడు ఎస్. ఐ.

ఇంతలో సుబ్బన్నవచ్చాడు గోపాలం యింటికి. "ఓ మనిషి ప్రాణం తీయించారన్న చెడ్డపేరు సుబ్బన్నగారికి వస్తుంది?" అన్నాడు సుబ్బన్నను కూడా కలుపుతూ ఎస్. ఐ.

"ఓ మనిషి ప్రాణం తీయించాడన్న పేరు రావడం ఈ రోజుల్లో గౌరవమేలెండి" అన్నాడు గోపాలం.

"అదేం మాటయ్యా" అన్నాడు సుబ్బన్న"

"ఏదో సరదాకి వేళాకోళం ఆడుతున్నారు లెండి" అన్నాడు ఎస్. ఐ.

"అయితే యిప్పుడు యేం చేద్దామంటారు?" అన్నాడు గోపాలం.

"ఏమైనా వీరేసు శవం దహనం కావాలి" అన్నాడు ఎస్ ఐ.

"దానికి క్రైస్తవులు ఒప్పుకోవడం లేదే!" అన్నాడు గోపాలం. ఒక్కక్షణం ఆలోచించి గోపాలం "పోనీ ఓ పని చెయ్యండి. పేటలోకి మీరే వెళ్ళి లాఠీచార్జి చేసి హిందువులకి శవాన్ని అప్పగించండి" అని సలహా యిచ్చాడు ఎస్. ఐ కి.

"అమ్మో" జనం శాంతంగా వున్న

ప్పుడు మన దబాయింపు చెల్లుతుంది కాని, యిలా రెచ్చిపోయినప్పుడు జనం మధ్యకి వెడితే వాయించేస్తారు. ఏదో వుపాయం మీరె ఆలోచించాలి. మీ మాట మీద నమ్మకంతో వచ్చాను. పొరపాటు జరిగిపోయింది. మనం మనం పెద్దవాళ్ళం. మనలో మనం సమయం వచ్చినప్పుడు ఆదుకోకపోతే ఈ పాటకపు జనం మనల్ని బతకనివ్వరు" అన్నాడు ఎస్. ఐ

"సరేనండీ యెలాగ? ఆ వుపాయం ఏదో మీరే చెప్పండి" అన్నాడు గోపాలం.

ఎస్ ఐ. ఆలోచించి "ఓ పనిచేస్తే" అన్నాడు.

"ఏంటదీ?" అన్నాడు సుబ్బన్న.

"మన రాజు కొట్టించి వెన్నుమీదకనుక కాళ్ళు క్రైస్తవులకిచ్చి పాతిపెట్టుకోమని మొండెం తగల బెట్టించేస్తే" అన్నాడు ఎస్. ఐ

"శవాన్ని రెండు ముక్కలుగా మీరు చేస్తారా" అన్నాడు గోపాలం.

"అబ్బే నావల్లకాదు" అన్నాడు ఎస్ ఐ

"ఎవరేనా డాక్టర్ని పురమాయిస్తారా?" అన్నాడు గోపాలం.

"అమ్మో డాక్టరు వస్తే పోషుమార్టమ్ గొడవ. గుట్టు బటబయలైపోయి మన పీకకే చుట్టుకుంటుంది మొత్తం" అన్నాడు ఎస్. ఐ. కంగారుగా.

'సరే ఓపని చేద్దాం' అన్నాడు గోపాలం ఒక్కక్షణం ఆలోచించి.

"ఏటదీ" అన్నాడు సుబ్బన్న.

"ఇంతమంది జనం నోరు మూయించాలంటే ఖర్చుతో కూడుకున్న పని- కనీసం పదివేలు వుంటే ఏదో మార్గం ఆలోచించవచ్చు". అన్నాడు గోపాలం.

"నేనో అయిదు వేలు యిస్తాను" అన్నాడు సుబ్బన్న.

"నేనో అయిదువేలు యిచ్చుకుంటాను ఉద్యోగం పోకుండా చూడండి" అన్నాడు ఎస్ ఐ

మొత్తం పదివేల రూపాయలూ అందుకున్నాడు గోపాలం.

సుబ్బన్ననీ, ఎస్ ఐ.నీ వెళ్ళమన్నాడు.

ముందు క్రైస్తవుల పెద్దలకి కబురంపేడు-వాళ్ళు వచ్చారు. "మీ పట్టు సబబైందే. ప్రస్తుతం వాడు వీరేసు. క్రైస్తవుడు. పాతిపెట్టడం సబవు. అందుకని కొట్లాటకి దిగకండి. నేను వాళ్ళని ఒప్పించేదాకా ఓర్పు పట్టండి. మనది మత సామరస్యం. మత స్వాతంత్ర్యంగల దేశం. మైనారిటీలకి అన్యాయం జరగడం నాకు నచ్చదు. నేను ఒప్పుకోను" అని చెప్పి వాళ్ళని ఒప్పించాడు. క్రైస్తవ పెద్దలు గోపాలానికి నమస్కారంచేసి వెళ్ళారు.




తరువాత హిందువులకి కబురంపాడు. పెద్దలు వచ్చారు.

"వీరేసుగాడి శవాన్ని పాతిపెడితే మనకి వచ్చిన నష్టం ఏమిటి?" అన్నాడు గోపాలం.

"హిందువుని ఎలా పాతిపెడతారు? పాతిపెడితే ఎలా వూరుకుంటాం?" అన్నారు పెద్దలు ఆవేశంగా.

"నేనూ హిందువునేనయ్యా" అన్నాడు గోపాలం. మత పెద్దలు తగ్గారు.

"ముందు వాళ్ళని వాడి శవాన్ని పెట్టెలో పెటి పాతిపెటనివ్వండి.

రెండవ కంటివాడికి తెలియనివ్వకుండా రాత్రికి రాత్రి పెటెతోసహా బయటకితీసి దహనం చెయ్యండి. ఈ విషయం గుట్టుగా వుంచండి. వాళ్ళకి అడ్డు చెప్పకండి. అడ్డు వెళ్ళకండి" అని సలహా యిచ్చాడు.

పెద్దలు క్షణంపాటు గోపాలం తెలివికి ఆశ్చర్యపోయారు.

"అంతిమ విజయం మనదే" అన్నాడు గోపాలం.

పెద్దలు సరేనని వెళ్ళిపోయారు.

వీరేసు శవానికి శాస్త్రయుక్తంగా ముందు క్రైస్తవ కర్మకాండ. తరువాత రహస్యంగా హైందవ కర్మకాండ జరిగిపోయాయి. వాడి శవం బూడిదైపోయింది.

పేటలోని హిందువులూ, క్రైస్తవులూ కూడా గోపాలం జనం ఈనాడు.

ఎస్ ఐ. గోపాలం చెప్పు చేతుల్లో వుండే ఆఫీసరు.

సుబ్బన్న గోపాలం జేబులో మనిషి.

అన్నిటికీ మించి గోపాలం జేబులో పదివేలు. "మాయమైన కోడీ, మనిషి శవం! మీకూ ఖరీదు వుందన్నమాట.

"కాదేదీ రాజకీయానికి అనర్హం" అని పించారు. అనుకున్నాడు గోపాలం.

సుబ్బన్న కొడుకు రంగడే రోజూ ఓ కోడిని కాజేసి తను కొత్తగా మరిగిన వుంపుడుకత్తెతో జల్సా చేస్తున్నాడన్న నిజం వీరేసుతోటే బూడిదైపోయింది. ★